
సాక్షి ఖమ్మం

సోమవారం ↓ 9 ↓ అక్టోబర్ ↓ 2023



..బాధితులకు నిధులు

తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు శాశ్వత పరిష్కారం చూపేందుకు నిధులు ఇస్తామని ఎంపీ వద్దిరాజు అన్నారు. 8లో



నవరాత్రి వేడుకలకు వేళాయె..

భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో ఈ నెల 15వ తేదీ నుంచి 'శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు' జరగనున్నాయి. 10లో

వాతావరణం

గరిష్ఠం / కనిష్ఠం

36° / 23°

జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రత అధికంగా ఉంటుంది. ఎండలు, ఉక్కపోత వాతావరణంతో ఇక్కట్లు తప్పవు.

న్యూస్‌రీల్

నేడు ఉమ్మడి జిల్లాలో మంత్రి పువ్వాడ పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్ : రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సోమవారం ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 8 గంటలకు ఖమ్మం నుంచి బయలుదేరి 10 గంటలకు భద్రాచలంలో సీఆర్‌పీఎఫ్ క్యాంపు దగ్గర గోదావరి ఫ్లడ్ బ్యాంక్స్, అప్రోచ్ రోడ్లకు శంకుస్థాపన చేస్తారు. 10.20 గంటలకు భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో కిచెన్ కాంప్లెక్స్, సీసీ రోడ్లు, తదితర అభివృద్ధి పనులు ప్రారంభిస్తారు. 10.40 గంటలకు భద్రాచలం అంబేద్కర్ సెంటర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. మధ్యాహ్నం 2.30 గంటలకు ఖమ్మం చేరుకుని 3గంటలకు భక్తరామదాసు కళాక్షేత్రంలో గృహలక్ష్మి పథకం పత్రాలు, జీఓ 58 పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు.

ఖర్గేను కలిసిన 'రాయల'



ఖర్గేకు పుష్పగుచ్ఛం అందిస్తున్న రాయల నాగేశ్వరరావు

నేలకొండపల్లి : వచ్చే ఎన్నికల్లో పాలేరు నుంచి పోటీ చేసేందుకు తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు ఆదివారం ఢిల్లీలో కలిసి విన్నవించారు. గత తొమ్మిదేళ్లుగా పాలేరు డివిజన్‌లో పార్టీ బలోపేతానికి ఎంతగానో కృషి చేశానని, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా కార్యకర్తలకు అండగా ఉన్నానని ఖర్గే దృష్టికి తీసుకెళ్లారు. తన పనితీరును పరిశీలించి కాంగ్రెస్ టికెట్ ఇవ్వాలని కోరారు.

20 మందికి పదోన్నతులు

ఖమ్మం సహకారనగర్ : జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న 20మంది జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పిస్తూ సీసీఎల్ఏ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. జోనల్ స్థాయి హోదా కలిగిన పోస్టు కావడంతో జోనల్ పరిధిలోని మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, వరంగల్, ఖమ్మం జిల్లాలకు కేటాయించగా.. ఆయా జిల్లాలోని కలెక్టర్లు వారికి పోస్టింగ్‌లు ఇవ్వనున్నారు.

బచ్చోడును మండల కేంద్రం చేయాలి

ఎమ్మెల్యేను అడ్డుకున్న గ్రామస్తులు



ఎమ్మెల్యే కందాలను అడ్డుకుంటున్న బచ్చోడు గ్రామస్తులు

తిరుమలాయపాలెం: బచ్చోడును మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డిని గ్రామస్తులు కోరారు. ఆదివారం రాత్రి బచ్చోడు పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యేను పార్టీలకు అతీతంగా గ్రామస్తులంతా అడ్డుకుని నిరసన తెలిపారు. రాష్ట్రంలో అనేక మండలాలు ప్రకటించినప్పటికి బచ్చోడు విషయంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే మండల కేంద్రం ప్రకటన చెయ్యాలని డిమాండ్ చేశారు. కాగా, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని ఎమ్మెల్యే తెలిపారు. ఆ తర్వాత పోలీసుల జోక్యంతో పరిస్థితి సద్దుమణిగింది. నిరసన తెలిపిన వారిలో మండల సాధన కమిటీ సభ్యులు రమేష్, నర్సయ్య, హన్మంతరావు, మల్లికార్జున్, మల్లయ్య, దయాకర్, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

'సోషల్ వర్క్'లో డాక్టరేట్

ఖమ్మం సహకారనగర్ : నగరంలోని కాకతీయ యూనివర్సిటీ పీజీ కళాశాల సోషల్ వర్క్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న మట్టపల్లి వీరాంజనేయులుకు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ చేకూరి రామారావు తెలిపారు. డాక్టరేట్ వచ్చిన సందర్భంగా ఆదివారం కళాశాలలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ.. వరంగల్ జోన్ పరిధిలోని 'బాల నేరస్తుల తీవ్రత, బాలుర పరిశీలన గృహంపై మ్యాగ్నిట్యూడ్ ఆఫ్ జువెనైల్ డిలిక్వెన్సీ ఇన్ తెలంగాణ' అనే అంశంపై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆచార్యులు డాక్టర్ పి వెంకటరమణ పర్యవేక్షణలో చేసిన పరిశోధన గ్రంధానికి డాక్టరేట్ వచ్చిందని తెలిపారు. సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం పాలవరం గ్రామానికి చెందిన వీరాంజనేయులు గత పది సంవత్సరాలుగా సోషల్ వర్క్ విభాగంలో అధ్యాపకుడిగా పనిచేస్తూ ఉస్మానియా, కాకతీయ తదితర విశ్వవిద్యాలయాలు నిర్వహించిన ప్రాంతీయ, జాతీయ స్థాయిలో జరిగిన పలు సెమినార్లకు హాజరయ్యారని, వివిధ అంశాలపై తాను చేసిన పరిశోధన పత్రాలను సమర్పించారని అన్నారు. ఈ సందర్భంగా వీరాంజనేయులును అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

కొలువుదీర శిక్షణ!





బీసీ స్టడీ సర్కిల్ (ఇన్‌సెట్) స్టడీ సర్కిల్‌లోని గ్రంథాలయం

ఉద్యోగార్థులకు వరంలా బీసీ స్టడీ సర్కిల్

- 2010 నుంచి ట్రైనింగ్ ఇస్తున్న నిర్వాహకులు
- నాటి నుంచి పలు పోటీ పరీక్షల్లో రాణిస్తున్న అభ్యర్థులు
- ప్రభుత్వ కొలువులకు కేరాఫ్‌గా నిలిచిన కేంద్రం
- ఇటీవలి పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో 48 మంది ఎంపిక

ఖమ్మంమయూరిసెంటర్: నిరుద్యోగ యువత కల సాకారం చేసుకునేందుకు ఖమ్మం బీసీ స్టడీ సర్కిల్ వరంలా మారింది. ఖమ్మం కేంద్రంగా ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఇస్తూ వారు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేలా ప్రోత్సహిస్తోంది. పోటీ పరీక్షల్లో నాణ్యమైన విద్యను అందిస్తూ హైదరాబాద్ వంటి మహానగరాల్లో నిర్వహించే ప్రతిష్టాత్మక కోచింగ్ సెంటర్లకు దీటుగా ఖమ్మంలోని బీసీ స్టడీ సర్కిల్ నిలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యాన నిర్వహించే ఈ శిక్షణా కేంద్రంలో 2014 నుంచి ఇప్పటి వరకు 2,514 మంది వివిధ ఉద్యోగాల కోసం శిక్షణ పొందారు. ఇందులో 855 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఇక్కడ శిక్షణ పొందిన అభ్యర్థుల్లో అత్యధిక శాతం ప్రభుత్వ కొలువులు సాధించి తమ కల నెరవేర్చుకుంటున్నారు.

ప్రస్థానం మొదలైందిలా..

ఆర్థికంగా వెనుకబడి పోటీ పరీక్షలకు శిక్షణ పొందలేకపోతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యర్థుల సమస్యలను గుర్తించిన నాటి ప్రభుత్వం 2010లో బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేసింది. అయితే తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ స్టడీ సర్కిల్ నిర్వహణను ప్రతిష్టాత్మకంగా తీసుకొని సౌకర్యాల కల్పనతో పాటు పోటీ పరీక్షలకు అవసరమైన మెటీరియల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. శిక్షణ పొందిన ప్రతి బ్యాచ్‌లో పదుల సంఖ్యలో అభ్యర్థులు కొలువులు సాధించడంతో జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్ పోటీ పరీక్షలకు నాణ్యమైన శిక్షణ ఇస్తున్న కేంద్రంగా పేరు సాధించింది.

నిరంతర పర్యవేక్షణ..

స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసింది. నాణ్యమైన శిక్షణతోపాటు అభ్యర్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్, ఇతర సదుపాయాలను కల్పిస్తున్నారు. స్టడీ సర్కిల్‌కు ప్రత్యేకంగా నియమించిన డైరెక్టర్ నిరంతరం శిక్షణా కేంద్రాన్ని పర్యవేక్షించడంతో పాటు అభ్యర్థులు పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేలా ప్రేరిపిస్తున్నారు. స్టడీ సర్కిల్‌లో డిజిటల్ తరగతులు బోధించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇక ప్రత్యేకంగా గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి శిక్షణకు అవసరమైన మెటీరియళ్లను అందుబాటులో ఉంచుతున్నారు.

ప్రముఖ కోర్సుల్లో..

స్టడీ సర్కిల్‌లో నిరుద్యోగ అభ్యర్థుల కోసం అధికారులు పలు కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణలో ఎస్‌బీఐ క్లర్క్స్, ఎస్‌బీఐ పీఓ, సింగరేణి, ఎల్ఐసీ, గ్రూప్ ఫౌండేషన్, ఎస్ఐ మెయిన్స్, పోలీస్ కానిస్టేబుల్ మెయిన్స్, ఎస్ఎస్‌సీ, గురుకుల మెయిన్స్ సబ్జెక్ట్స్, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ (ఎఫ్ఆర్ఓ, ఎఫ్ఎస్ఓ, ఎఫ్‌బీ), ఎస్‌జీటీ, హెచ్‌డబ్ల్యూఓస్, ఆర్ఆర్‌బీ గ్రూప్–డీ, లోకో పైలట్, వీఆర్ఓ, గ్రూప్–1, 2, 3, 4 ఫౌండేషన్ అండ్ మెయిన్స్, జూనియర్ పంచాయతీ సెక్రటరీ, ఆర్ఆర్‌బీ, బ్యాంక్స్ వంటి పోటీ పరీక్షలకు స్టడీ సర్కిల్‌లో శిక్షణ ఇస్తున్నారు. ఇటీవల ప్రకటించిన ఎస్ఐ, కానిస్టేబుల్ ఫలితాల్లో బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందిన అభ్యర్థుల్లో 48 మంది కొలువులు సాధించడం విశేషం. వీరిలో నలుగురు ఎస్ఐలు, 44 మంది కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు.

లక్ష్యాలను చేరుకునేలా శిక్షణ..



ఎన్నో ఆశలతో నిరుద్యోగ యువత పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు బీసీ స్టడీ సర్కిల్‌లో చేరుతున్నారు. వారు అనుకున్న లక్ష్యాలకు అనుగుణంగా శిక్షణ ఇస్తూ.. ఆ లక్ష్యాన్ని వారు సాధించేలా తయారు చేస్తున్నాం. జిల్లా ఉన్నతాధికారులు, స్టడీ సర్కిల్ రాష్ట్ర అధికారుల సూచనలతో అభ్యర్థులకు అవసరమైన మెటీరియల్ అందుబాటులో ఉంచుతున్నాం. ఇక్కడ శిక్షణ పొందిన అభ్యర్థులు కొలువులు సాధించడం చాలా సంతోషంగా ఉంది.

– జి.శ్రీలత, డైరెక్టర్, బీసీ స్టడీ సర్కిల్

నాతో పాటు నా సోదరి కూడా..



ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో బీసీ స్టడీసర్కిల్‌లో శిక్షణ పొందాను. పలు కోర్సుల్లో శిక్షణ తీసుకున్న నేను తొలుత వీఆర్ఏ, ఎస్ఎస్‌సీ ఉద్యోగాలకు ఎంపికయ్యాను. అదే సమయంలో ఎస్ఐ ఉద్యోగానికి ఎంపికయ్యాను. నాతో పాటు నా సోదరి ఇక్కడే శిక్షణ పొంది ఉద్యోగం సాధించింది. స్టడీసర్కిల్‌లో నాణ్యమైన శిక్షణతో పాటు నిరంతర పర్యవేక్షణ ఉండడంతో సులువుగా ఉద్యోగాలు సాధించగలుగుతున్నాం.

– బి.లక్ష్మీభార్గవి, సబ్ ఇన్‌స్పెక్టర్

ప్రచారంలో జోష్..

జెట్ స్పీడ్‌లో మంత్రి పువ్వాడ

- నియోజకవర్గాన్ని ఇప్పటికే రెండుసార్లు చుట్టేసిన అజయ్
- ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలతో బిజీ
- సంక్షేమ పథకాలతో ప్రజలకు మరింత చేరువ



రఘునాథపాలెం మండలం పాపటపల్లి సభలో నినాదాలు చేయిస్తున్న మంత్రి పువ్వాడ అజయ్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఖమ్మం నియోజకవర్గంపై ఫోకస్ పెంచారు. గత 15 రోజులుగా ఇక్కడే మకాం వేసి ప్రజలతో మమేకం అవుతున్నారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడే వరకు వీలైనంతగా అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లాలనే లక్ష్యంతో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలపై దృష్టి సారించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పంపిణీకి ప్రాధాన్యం ఇస్తూ.. ప్రజలను నేరుగా కలుస్తున్నారు. కార్యకర్తలు, ప్రజలతో ఆత్మీయ సమ్మేళనాల్లో పాల్గొంటున్నారు. గతంలోనూ వాడవాడకూ పువ్వాడ పేరుతో ప్రజలను కలిసిన ఆయన మరోమారు పార్టీ అభ్యర్థిత్వం ఖరారయ్యాక ఇప్పటికే రెండుసార్లు నియోజకవర్గం అంతా చుట్టేశారు. ప్రత్యర్థి పార్టీలు అభ్యర్థులను ప్రకటించకముందే పువ్వాడ ఎన్నికల రణరంగంలో జెట్‌స్పీడ్ ప్రచారంలో వెళ్తున్నారు.

అభ్యర్థుల ప్రకటన మొదలు...

బీఆర్ఎస్ అధిష్టానం ఆగస్టు 21న అభ్యర్థులను ప్రకటించింది. అప్పటి నుంచి మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ నియోజకవర్గంలో పర్యటించేందుకు వచ్చిన ఏ అవకాశాన్నీ వదులుకోవడం లేదు. సమావేశాలు, ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు, సమ్మేళనాలతో తీరిక లేకుండా గడుపుతున్నారు. అడపాదడపా హైదరాబాద్ వెళ్లి వస్తూ.. ఎక్కువ సమయం నియోజకవర్గానికే కేటాయిస్తున్నారు. ప్రతిపక్ష పార్టీల నుంచి పోటీ చేసే అభ్యర్థులు ఇంకా ఖరారు కాకముందే మంత్రి పువ్వాడ నియోజకవర్గాన్ని రెండు, మూడుసార్లు చుట్టేశారు. అలాగే ఈ ఏడాది జనవరి నుంచే డివిజన్లలో పర్యటనలు జరిగాయి. వాడవాడకూ పువ్వాడ పేరుతో చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించే ప్రక్రియ సాగింది. ఇక అభ్యర్థుల ప్రకటన తర్వాత ఈ జోరు మరింత పెరిగింది. ఆత్మీయ సమ్మేళనాల్లో పాల్గొనడమే కాక పార్టీ నాయకులు, సానుభూతిపరులు ఎవరు ఆహ్వానించినా ఆ ప్రాంతానికి వెళ్తున్నారు. డివిజన్లలో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించగా.. అపార్ట్‌మెంట్లలో కూడా ఆయా అపార్ట్‌మెంట్ వాసుల ఆహ్వానం మేరకు వెళ్లి ప్రసంగిస్తున్నారు.

సంక్షేమమే అజెండా..

బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రచారంపై మంత్రి దృష్టిపెట్టారు. వీటితో నిరుపేదలకు లబ్ధి చేకూరుతుందని, పేదల ఇళ్లలో వెలుగులు నింపుతాయని ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. గృహలక్ష్మి, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, దళితబంధు, బీసీ బంధు, మైనార్టీ బంధు, జీఓ 58, 59 కింద స్థలంపై హక్కు పత్రాలు వంటి పథకాలను ప్రచార అస్త్రాలుగా ఉపయోగిస్తున్నారు. గృహలక్ష్మి కింద 4 వేల మంజూరు పత్రాలు, జీఓ 58 పరిధిలో 5 వేల ఇళ్ల పట్టాల పంపిణీ చేశారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద 8,733 మందికి రూ.82.41 కోట్లు, సీఎంఆర్ఎఫ్ కింద 5 వేల మందికి రూ.21 కోట్ల విలువైన చెక్కులు అందజేశారు.

అభివృద్ధి మంత్రం..

సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి మంత్రాన్ని మంత్రి బ్రహ్మాస్త్రంగా ఉపయోగిస్తున్నారు. 2014కు ముందు ఖమ్మం ఎలా ఉంది.. ఇప్పుడెలా ఉందో చెప్పాలని ప్రజలనే ప్రశ్నిస్తున్నారు. హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేశామని, రోడ్లు, సెంట్రల్ లైటింగ్, పార్కులు, గోళ్లపాడు చానల్, లకారం ట్యాంక్‌బండ్ ఐటీ హబ్, నూతన బస్టాండ్, కలెక్టరేట్ వంటి పనులు ప్రచారాస్త్రాలుగా ఉపయోగపడుతున్నాయి. ప్రత్యర్థి పార్టీలపై విమర్శలకన్నా.. ప్రస్తుతం చేసిన అభివృద్ధిని చెప్పుకునేందుకు ప్రాధాన్యత పెరిగింది. మున్నేరు వద్ద రిటైనింగ్‌వాల్, మున్నేరుపై తీగల వంతెన నిర్మాణంతో ఖమ్మం రూపురేఖలు మారుతాయని, గోళ్లపాడు చానల్ తరహాలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణంతో నగర వాసుల ఇబ్బందులు తొలగుతాయని చెబుతూ ఓటర్లను ఆకర్షిస్తున్నారు. దీనికి తోడు గత నెల 30న ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఖమ్మంలో పర్యటించి దాదాపు రూ.1,370 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు.

వ్యూహాత్మక ప్రచారం ..

మంత్రి పువ్వాడ తన ప్రచార కార్యక్రమాన్ని ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తున్నారు. చేసిన పనులు, చేయబోయే పనులను వివరిస్తూనే.. గత ప్రభుత్వాల పనితీరును ప్రశ్నిస్తున్నారు. ప్రధానంగా ఖమ్మం ప్రజలు గతంలో ఎదుర్కొన్న సమస్యలు పరిష్కరించానని చెబుతున్నారు. వేసవికాలం వస్తే మంచినీటి ఎద్దడి విపరీతంగా ఉండేదని, మిషన్ భగీరథతో ఈ సమస్యను పరిష్కరించామని, గతంలో ఎప్పుడు కరెంట్ ఉంటుందో తెలియని పరిస్థితి ఉండేదని, ఇప్పుడు 24 గంటల కరెంట్ ఇస్తున్నామని చెబుతూ ప్రచారంలో తనదైన శైలిలో దూసుకెళ్తున్నారు.

ఖమ్మం బస్టాండ్‌కు ఉత్తమ అవార్డు

పరిశుభ్రత, వసతుల కల్పనలో రాష్ట్రంలోనే మొదటి ర్యాంక్



డీఎం శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ఆర్ఎం వెంకన్న

ఖమ్మం మామిళ్లగూడెం : పరిశుభ్రత, ప్రయాణికులకు మెరుగైన వసతుల కల్పనలో ఖమ్మం ఆర్టీసీ నూతన బస్టాండ్ రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంక్ సాధించి ఉత్తమ అవార్డుకు ఎంపికైంది. ఈ మేరకు ఆర్టీసీ కళాభవన్‌లో ఖమ్మం డీఎం శ్రీనివాస్‌ను ఎండీ సజ్జనార్ ఘనంగా సత్కరించి రూ.10 వేలు నగదు బహుమతి అందజేశారు. కాగా, ఆదివారం ఖమ్మం బస్టాండ్‌లో ఆర్ఎం సీహెచ్ వెంకన్న డీఎంను ఘనంగా సత్కరించారు. డీఎంతో పాటు సూపర్‌వైజర్లు, బస్‌స్టేషన్ సిబ్బందని అభినందించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రయాణికుల సౌకర్యార్థం నూతన బస్టాండ్‌లో టికెట్ రిజర్వేషన్ కౌంటర్‌ను 14వ నంబర్ ప్లాట్‌ఫాం ఎదురుగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బస్టాండ్‌లో 24 గంటలూ అందుబాటులో ఉండేలా కార్గో సెంటర్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆర్టీసీ బస్సుల్లో నెల రోజుల ముందుగా రిజర్వేషన్ చేయించుకునే ప్రయాణికులకు వారి తిరుగు ప్రయాణంలో చార్జీలో 10 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఓ రామ్మోహన్‌రావు, సీఐ రామిశెట్టి రామయ్య, సూపరింటెండెంట్ ఎ.నాగేశ్వరరావు, ఎస్ఏపీ శ్రీమన్నారాయణ, ఎస్ఎం రామకృష్ణ పాల్గొన్నారు.

రీజియన్‌లో 31 మందికి ఉద్యోగోన్నతి

ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్లకు ఊరట

ఖమ్మం మామిళ్లగూడెం : ఆర్టీసీ ఖమ్మం రీజియన్‌లో సుదీర్ఘకాలంగా డ్రైవర్, కండక్టర్లుగా పనిచేస్తున్న 31 మందికి ఉద్యోగోన్నతి లభించింది. వారు కౌన్సెలింగ్ ద్వారా కోరుకున్న చోట పోస్టింగ్ ఇచ్చారు. ఖమ్మం రీజియన్‌లోని మణుగూరుకు ఏడుగురు, భద్రాచలానికి ఆరుగురు, కొత్తగూడేనికి ఇద్దరు, సత్తుపల్లికి 8 మంది, మధిరకు ముగ్గురు, ఇల్లెందుకు ఐదుగురిని ఏడీసీ, కంట్రోలర్లుగా బదిలీ చేస్తూ ఆర్ఎం సీహెచ్ వెంకన్న ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్ఎం మాట్లాడుతూ.. సంస్థ అభివృద్ధి, ఆదాయ సముపార్జనలో డ్రైవర్, కండక్టర్ల పాత్ర కీలకమన్నారు. పదోన్నతి పొందిన వారు విధి నిర్వహణలో ఇతర ఉద్యోగులకు మార్గదర్శకంగా నిలవాలని కోరారు. తమకు కేటాయించిన డిపోల్లో రిపోర్టు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పీఓ శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అండర్ –19 రగ్బీ జట్టు ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్ : జూనియర్ కళాశాలల క్రీడల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని ఎస్ఆర్ అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల మైదానంలో ఉమ్మడి జిల్లా స్థాయి రగ్బీ జట్లను ఎంపిక చేశారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా క్రీడల సంఘం కార్యదర్శి ఎండీ మూసాకలీం తెలిపారు. జిల్లా అండర్ –19 జట్టుకు ఎంపికైన వారిలో ఎం.డీ. సయ్యద్ ముబారక్, జి.అరవింద్, పి.భరత్, యు.సాయికిరణ్, ఎ.రాకేష్, ఎం.నరేందర్‌గౌడ్, ఎ.సాయిచరణ్, ఎస్.కె.సోహెల్, డి.యువకుమార్, డి.వేణు, ఎస్.మహేష్, పి.ప్రకాష్, బాలికల జట్టులో జి.చందన, పి.హారిక, వి.మాళవిక, టి.అనూష, భవాని, గాయత్రి, బి.వినీల, ఎస్.భాగ్యశ్రీ, ఎండీ కరిష్మా, ప్రత్యూష, బి.కావ్య, ఎం.అశ్విత ఉన్నారని వివరించారు.



ఎంపికైన జిల్లా జట్టు

చకచకా ఈ–కేవైసీ



కొణిజర్ల మండలంలోని రేషన్ దుకాణంలో ఈ-కేవైసీ చేస్తున్న లబ్ధిదారులు

- జిల్లాలో చురుకుగా సాగుతున్న ప్రక్రియ
- రేషన్‌షాపులకు బారులుదీరుతున్న లబ్ధిదారులు
- ఇప్పటికే 5లక్షలకు పైగా యూనిట్లు పూర్తి
- రాష్ట్రంలోనే జిల్లాకు ఆరో స్థానం!

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో వ్యవస్థను పటిష్టం చేస్తూ ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా పౌరసరఫరాల శాఖపై ప్రత్యేక దృష్టి సారించింది. రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా ఉండేందుకు ప్రస్తుతం ఈ పాస్ మిషన్ల ద్వారా సరుకులు పంపిణీ చేస్తుండగా.. ఇందులో కూడా అనర్హులు ఉన్నారా అనే అంశాన్ని తేల్చేందుకు రంగంలోకి దిగింది. ఈ మేరకు ఈ-కేవైసీని అమలు చేస్తున్నారు. నూతన నిర్ణయం మేరకు రేషన్ కార్డుల్లో లబ్ధిదారులంతా షాపునకు వెళ్లి ఈ-కేవైసీ చేయించుకోవాలి. అప్పుడే రేషన్ సరఫరా జరుగుతుందని, లేకపోతే తొలగించే అవకాశముందని చెబుతున్నారు.

ఈ – కేవైసీ తప్పనిసరి

రేషన్ దుకాణాల ద్వారా లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేస్తుండగా.. ప్రతీ నెల కార్డులోని ఎవరైనా లబ్ధిదారు తన వేలిముద్ర వేసి సరుకులు తీసుకునేవారు. అయితే ఈసారి కార్డులోని ప్రతీ లబ్ధిదారుడు రేషన్ దుకాణంలో ఈ-కేవైసీ చేయాలని నిర్ణయించి, ఈ అనుసంధానానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో లబ్ధిదారులు రేషన్ దుకాణాల బాట పట్టారు. ఆహారభద్రత కార్డుల్లోని సభ్యులంతా ఒకేసారి ఈ-కేవైసీ చేసుకోవాలని అధికార యంత్రాంగం చెబుతుండగా.. దూరప్రాంతాల్లో నివసించే వారి పరిస్థితి ఏంటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

మండలాలు	21
రేషన్ దుకాణాలు	748
రేషన్ కార్డులు	4,11,906
లబ్ధిదారులు	11,36,226
ఈ-కేవైసీ పూర్తయిన లబ్ధిదారులు	5,86,076

బోగస్‌కు చెక్...

బోగస్ కార్డులు, లబ్ధిదారుల తొలగింపు ఈ-కేవైసీ ద్వారా సులభంగా గుర్తించొచ్చని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. అనేక సంవత్సరాలుగా మరణించిన వారి పేర్లు తొలగించకపోగా, ఇతర ప్రాంతాలు, ఇతర దేశాల్లో ఉంటున్న వారి పేరిటా సరుకులు తీసుకుంటున్నారు. అలాంటి వాటికి చెక్ పెట్టేందుకు ఈ-కేవైసీ దోహదపడనుంది. ఇదిలా ఉండగా ఈ-కేవైసీ ఎప్పటి వరకు పూర్తి చేయాలనే అంశంపై ఇప్పటి వరకు ఎలాంటి గడువు విధించలేదని అధికారులు చెబుతున్నారు. అయినప్పటికీ వీలైనంత త్వరగా ప్రక్రియ పూర్తి చేయాలనే లక్ష్యంతో కృషి చేస్తున్నారు. కాగా, ఈ-కేవైసీ నమోదులో రాష్ట్రంలోనే జిల్లా ఆరో స్థానంలో నిలవడం విశేషం. హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి, నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాలు మొదటి ఐదు స్థానాల్లో నిలవగా ఖమ్మం జిల్లా ఆరో స్థానంలో నిలిచింది.

ఏ షాపుకైనా వెళ్లొచ్చు...

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని రేషన్ లబ్ధిదారులంతా ఈ-కేవైసీ చేయించుకోవాలి. ఇప్పటికే ఈ-కేవైసీ ప్రక్రియ జిల్లాలో వేగంగా జరుగుతుంది. ఎక్కడ రేషన్ దుకాణంలోనైనా చేయించుకోవచ్చు. అయితే, కార్డుపై పేర్లు ఉన్న వారందరూ ఒకేసారి వెళ్లాలి.

– గంటా శ్రీలత, జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి

పెద్దమ్మతల్లికి విశేషపూజలు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ఆదివారం శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి రాష్ట్రంలో వివిధ ప్రాంతాలతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తజనులు క్యూలైన్ ద్వారా అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. మొక్కులు సమర్పించారు. అన్నప్రాశనలు, ఒడి బియ్యం, పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎన్.రజనీకుమారి, డైరెక్టర్లు చింత నాగరాజు, గంధం వెంగళరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళాలు

పెద్దమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి పాల్వంచ శ్రీనగర్‌కాలనీకి చెందిన బుడగం రవికుమార్, సునీత దంపతులు రూ.10,116, సుజాతనగర్ మండలం సీతంపేటబంజరకు చెందిన భక్తులు రూ.7,116 విరాళం అందించారు. మరికొందరు భక్తులు రూ.8 వేల విలువైన కుర్చీలను అందించారు. ఈ మేరకు ఆలయ ఈఓ ఎన్.రజనీకుమారి ఆదివారం వివరాలు వెల్లడించారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అమ్మవారి సేవలో నల్లగొండ జిల్లా జడ్జి

శ్రీకనకదుర్గ అమ్మవారిని ఆదివారం నల్లగొండ జిల్లా అడిషనల్ జడ్జి తిరుపతిరావు, రిటైర్డ్ ఏఎస్పీ సిరిసిల్ల రవిచంద్రం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.

క్లుప్తంగా

బహుజన కమ్యూనిస్ట్ పార్టీ ఖమ్మం అభ్యర్థిగా కృష్ణారావు


లిక్కి కృష్ణారావు యాదవ్

ఖమ్మంరాపర్తినగర్: బహుజన లెఫ్ట్ ఫ్రంట్ బలపరుస్తున్న బహుజన కమ్యూనిస్ట్ పార్టీ ఖమ్మం అసెంబ్లీ అభ్యర్థిగా లిక్కి కృష్ణారావుయాదవ్‌ను ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పర్వతాలు, జిల్లా కార్యదర్శి పొడకంటి రాంబాబు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లిక్కి కృష్ణారావు తెలంగాణ యాదవ సంఘం వ్యవస్థాపకుడిగా నిరంతరం బహుజన ఉద్యమాలను నిర్వహిస్తూ అణగారిన కులాల కోసం పనిచేశారని తెలిపారు. కార్యక్రమంలో బీడీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గోపె వినయ్, దినేశ్, టీవీ రాజు, వెంకట్రామయ్య, తండా ఉప్పలయ్య, శ్రీనివాసరావు, రామారావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

92 మందికి కుట్టు మిషన్లు పంపిణీ


కుట్టుమిషన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం మహిళలకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తెలిపారు. మండలంలోని కొత్తూరు రైతువేదిక వద్ద ఆదివారం మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 92 మంది ముస్లిం మహిళలకు కుట్టు మిషన్లు అందించి మాట్లాడారు. కార్యక్రమంలో మైనార్టీ కార్పొరేషన్ ఈడీ మైమూద్, ఎంపీపీ దొడ్డా హైమావతి, సర్పంచ్ ఒగ్గు విజయలక్ష్మి, శీలపు రెడ్డి హరికృష్ణారెడ్డి, ఒగ్గు శ్రీనివాసరెడ్డి, పెద్దిరెడ్డి పురుషోత్తం పాల్గొన్నారు.

డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న అబ్దుల్ హకీం

ఖమ్మంసహకారనగర్: ప్రభుత్వ డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలగాణ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ఎండీ అబ్దుల్ హకీం పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సంఘం కార్యాలయంలో ఉమ్మడి జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రైవర్ల సంఘం తరపున ఫిట్‌మెంట్ 30% ఇవ్వాలని, 15 ఏళ్లు దాటిన ప్రభుత్వ వాహనాలను తొలగించి వాటిలో స్థానంలో కొత్త వాహనాలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో హౌస్ బిల్డింగ్ సొసైటీ చైర్మన్ ఎండీ సలీం, నాయకులు కోటేశ్వరరావు, దాసరి వేణుగోపాల్, మామిడి బాబూరావు, రామారావుగౌడ్, వై.వీరారెడ్డి, వెంకటేశ్వరరావు, జి.నాగరాజు, ఎస్వీ ప్రసాద్, కొత్తగూడెం కన్వీనర్ వనమా శ్రీనివాసరావు, భద్రాచలం కోకన్వీనర్ జి.రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడు మృతి

తిరుమలాయపాలెం: పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. మండలంలోని తిరుమలాయపాలెం గ్రామానికి చెందిన గుండపల్లి వీరస్వామి (78) భార్య 14 ఏళ్ల కిందట మరణించగా చిన్న కుమారుడు కూడా అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో మానసికంగా కృంగిపోయిన వీరస్వామి ఈ నెల 4న పురుగుమందు తాగాడు. అతడిని ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా ఆదివారం మృతిచెందాడు. వృద్ధుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరంపై దాడి

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు గ్రోమోర్ సెంటర్ వెనుక చెట్ల పొదల్లో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో పోలీసులు దాడి చేసి ఇద్దరు వ్యక్తులు, రూ.1,600 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కామేపల్లిలో..

కామేపల్లి: మండలంలోని జోగ్గూడెం గ్రామంలో పేకాట స్థావరంపై ఆదివారం పోలీసులు దాడి చేసి ఆరుగురు యువకులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కోడి పందేల స్థావరాలపై దాడి

చింతకాని: మండలంలోని కోమట్లగూడెం గ్రామ సమీపంలో కోడి పందేలను నిర్వహిస్తున్న స్థావరాలపై ఆదివారం రాత్రి ఎస్‌ఐ రాజేందర్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడిలో పందెం కోళ్లు, ద్విచక్ర వాహనాలతో పాటు కొంత నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు పరారైనట్లు సమాచారం. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.12,231

నా పందెం ఈ జట్టుపై..

ప్రపంచకప్ నేపథ్యంలో జోరుగా బెట్టింగ్‌లు

- భారత్ మ్యాచ్‌లపై మరింత ఆసక్తి
- ఫోన్ పే, గూగుల్ పే ద్వారా నగదు బదిలీ



ఖమ్మంస్పోర్ట్స్: క్రికెట్ ప్రపంచకప్ మొదలైంది. దీంతోపాటు బెట్టింగ్ కూడా జోరుగా సాగుతోంది. వరుసగా భారత్ మ్యాచ్‌లు ఉండటంతో బెట్టింగ్ రాయుళ్లు ఈసారైనా గతంలో పోగొట్టుకున్నది వస్తుందేమోననే ఆశతో బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. ఇటీవలి కాలంలో వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లు వరుసగా జరగడంతో స్వల్ప సమయంలో ఎక్కువ ధనార్జన కోసం ఈ పందేలు కాస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పుడు ప్రపంచకప్ సుమారు నెలన్నరపాటు జరగనుండటంతో బెట్టింగ్ జోరుగా సాగే అవకాశాలున్నాయి. ఒకప్పుడు కేవలం మెట్రో ప్రాంతాలకే పరిమితమైన బెట్టింగ్ ప్రస్తుతం పల్లెలకు సైతం విస్తరించింది. జిల్లాలోని ఖమ్మంలో బార్లు, హోటళ్లు మ్యాచ్‌లు ఉన్న సమయంలో నిండిపోతున్నాయి. బెట్టింగ్‌లు ఉండటంతోనే ఇవి కళకళలాడుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం బెట్టింగ్‌ను నియంత్రించే వాళ్లు లేకపోవడంతో పందెం కాసేవాళ్లకు హద్దు లేకుండా పోయింది. అయితే, బెట్టింగ్‌లో పాల్గొని అప్పులపాలై కొందరు ఆత్మహత్య చేసుకున్న ఘటనలు కూడా జిల్లాలో ఉన్నాయి.

ప్రతీ సిక్స్, ఫోర్‌పైనా..

ఒకప్పుడు ఆన్‌లైన్ ద్వారా బెట్టింగ్‌లు జరిగేవి. మారుతున్న కాలానుగుణంగా ప్రస్తుతం ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా జోరుగా పందేలు సాగుతున్నాయి. భారత్ ఆడే 9 మ్యాచ్‌ల్లో ఎవరు గెలుస్తారనే దానిపైనే పందేలు ఎక్కువగా కాస్తున్నారు. మ్యాచ్ జరుగుతున్నంత సేపు కూడా బెట్టింగ్ నడుస్తూనే ఉంటుందని తెలుస్తోంది. బ్యాట్స్‌మెన్ కొట్టే సిక్స్, ఫోర్లపైనా.. బౌలర్ తీసే వికెట్లపైనా.. వైడ్ బాల్, నోబాళ్లపైనా పందేలు నడుస్తుంటాయి. మ్యాచ్ టై అయ్యే దానిపైన కూడా పందెం వేసుకునే వెసులుబాటు ఉన్నట్లు తెలుస్తోంది.

డబ్బు పోగొట్టుకుంటున్న యువత

గ్రామీణ ప్రాంతాల్లోని యువత జోరుగా బెట్టింగ్‌కు పాల్పడుతోంది. ఇంట్లో తల్లిదండ్రులపై ఒత్తిడి తెచ్చి డబ్బు తీసుకోవడం.. స్నేహితుల దగ్గర అప్పుగా తీసుకొని పందెంలో పెట్టి పోగొట్టుకోవడం తరచుగా కనిపిస్తోంది. ఆన్‌లైన్‌లో జరిగే బెట్టింగ్‌లో వంద పెడితే రూ.300 ఇస్తామంటూ ఊరిస్తూ వలలో వేసుకోవడం జరుగుతూ ఉంటుంది. ఇందులో ఇరుక్కుంటే ఇక అంతే సంగతులు. తొలుత డబ్బులు వచ్చినట్టే వచ్చి ఉన్నదంతా ఊడ్చుకుపోతుంది. అప్పుడు పోయిన డబ్బు కోసం మళ్లీ పందెం కాయడం, ఉన్న డబ్బు అంతా పోగొట్టుకోవడం.. దీంతో మనస్తాపానికి గురై యువత ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని పలువురు చెబుతున్నారు. కాగా, ఖమ్మంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో లింక్ బార్లే బెట్టింగ్‌కు అడ్డాలుగా మారుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. లింక్ బార్లో కూర్చొని, మద్యం సేవిస్తూ సెల్‌ఫోన్‌ల ద్వారా బెట్టింగ్‌కు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మద్యం, బెట్టింగ్ ఖర్చులను లింక్‌బార్ యాజమాని వద్దే అప్పుగా తీసుకుంటున్నారని తెలుస్తోంది.

ఆఫ్‌లైన్‌లోనూ..

గతంలో క్రికెట్ బెట్టింగ్ కేవలం ఆన్‌లైన్ ద్వారానే కొనసాగేది. ఇందుకోసం ముందస్తుగా రూ.లక్ష డిపాజిట్ చేస్తే ఆన్‌లైన్ ద్వారా బెట్టింగ్ చేసే అవకాశం ఉండేది. ప్రస్తుతం ఫోన్ పే, గూగుల్ పేలు అందుబాటులోకి వచ్చిన తర్వాత బెట్టింగ్‌కు పాల్పడటం సులభంగా మారింది. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడితే దొరికే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయనే కారణాలతో ఫోన్ పే, గూగుల్ పేనే ఆశ్రయిస్తున్నారు. అయితే, దాదాపు నెలన్నర రోజుల పాటు బెట్టింగ్ జరిగే అవకాశాలున్నప్పటికీ దీనిని నియంత్రించే వారు కరువయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పోలీస్ శాఖ పటిష్టమైన గస్తీని ఏర్పాటు చేసి బెట్టింగ్‌కు పాల్పడే ముఠాలను పట్టుకునే విధంగా చర్యలు తీసుకుంటే బాగుంటుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

తలసేమియా చిన్నారులకు ఎంపీ నిధులిస్తాం..

- 'సంకల్ప'కు సహకారం ఎప్పుడూ ఉంటుంది..
- రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర



మాట్లాడుతున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లాలో తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు ఓ శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేస్తానని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర హామీ ఇచ్చారు. ఈ అంశాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని, ఖమ్మం కేంద్రంగా చిన్నారులకు ఒక షెల్టర్ ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటానన్నారు. ఆదివారం ఖమ్మం నగరంలోని శ్రీశ్రీశ్రీ హోటల్‌లో సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో తలసేమియా, సికిల్‌సెల్ ఎనీమియాపై సమీక్ష నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపకురాలు పి.అనిత అధ్యక్షతన జరిగిన సదస్సులో ఎంపీ రవిచంద్ర మాట్లాడారు.. 15 ఏళ్లుగా తలసేమియాపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా అనిత పనిచేస్తున్నారని, ఇప్పుడు వారికి మరింత సహకారం అందించేందుకు తనపై పెద్ద బాధ్యత ఉందని తెలిపారు. జిల్లాలో 260 మంది తలసేమియా చిన్నారులకు రక్త పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన మిషన్‌ను తన ఎంపీ నిధులతో ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. జాతీయ తలసేమియా వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జెఎస్ అరోరా మాట్లాడుతూ దేశంలో 5 కోట్ల మంది తలసేమియా కొరియర్స్ ఉన్నారని, ప్రతి సంవత్సరం 12 వేల మంది తలసేమియా మేజర్‌గా జన్మిస్తున్నారని, వీరికి రక్తం సేకరించడం చాలా కష్టంగా మారిందని వెల్లడించారు. తలసేమియా జన్యుపరమైన వ్యాధి అని, వివాహానికి ముందు స్త్రీ, పురుషులు హెచ్‌ఎల్‌ఏ పరీక్షలు చేయించుకొని తలసేమియాను అరికట్టాలని పిలుపునిచ్చారు. ప్రముఖ సినీ నటుడు అమితాబ్ బచ్చన్ కూడా తలసేమియా కొరియర్ అని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ వ్యాధిని అరికట్టేందుకు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. అనంతరం సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ వెబ్‌సైట్‌ను ఎంపీ రవిచంద్ర ప్రారంభించారు. అంతకుముందు డాక్టర్ జెఎస్ అరోరా తలసేమియా చిన్నారులను పరీక్షించి, వ్యాధిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మందుల వినియోగం గురించి వివరించారు. కార్యక్రమంలో జాతీయ తలసేమియా సొసైటీ బాధ్యులు గగనదీప్ సింగ్, వైద్యులు డి.నారాయణమూర్తి, సాయిభార్గవ్, లక్ష్మీదీపతోపాటు కాసుల వెంకట్, అనురాధ, పి.పావని, పి.రవిచంద్ర, ఉదయ్‌భాస్కర్, వంశీ కిరిటీ పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ సందర్శన

ఖమ్మంస్పోర్ట్స్/ఖమ్మంలీగల్: సాహస్‌చౌదరి స్మారకార్థం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నీకి ఆదివారం ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యులు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర హాజరై క్రికెటర్లను పరిచయం చేసుకున్నారు. అనంతరం మాట్లాడి, కొద్దిసేపు బ్యాటింగ్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్రను దిలీప్‌చౌదరి, స్పోర్ట్స్ సెక్రటరీ రావుల వెంకట్, ఖమ్మం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దిరిశాల కృష్ణారావు, ఉపాధ్యక్షులు మాదిరాజు లక్ష్మీనారాయణ, న్యాయవాదులు వంగాల శ్రీనివాసరావు, మల్లికార్జున్‌గుప్తా, గుండ్లపల్లి శేషగిరిరావు, వికిరాల రాంబాబు, సింగం జనార్దన్‌గౌడ్ తదితరులు శాలువాతో సత్కరించారు.

సంక్షేమం పేరుతో ప్రజాధనం వృథా


మాట్లాడుతున్న దుర్గాప్రసాద్, పక్కన జావీద్

ఖమ్మంవన్‌టౌన్: సంక్షేమం పేరుతో బీఆర్ఎస్ తమ కార్యకర్తలకే ప్రజాధనాన్ని పంచిపెడుతోందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ జావీద్ అన్నారు. ఆదివారం నగరంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డిభవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.. ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికార బీఆర్ఎస్ హడావుడిగా వివిధ రకాల పథకాల పేరుతో కార్యకర్తలకు లబ్ధిచేకూర్చుతోందని ఆరోపించారు. శనివారం రఘునాథపాలెంలో ప్రతిపక్షాలు శాంతియుతంగా చేపడుతున్న నిరసన కార్యక్రమంపై దాడిచేసి అక్రమ కేసులు బనాయించడం నియంతృత్వానికి నిదర్శనమన్నారు. పదేళ్లుగా గుర్తుకురాని ప్రజలు ఎన్నికల ముందే గుర్తుకువచ్చారా? అని ప్రశ్నించారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని మభ్యపెట్టి ఇంతవరకు పరిష్కారం చూపలేదని మండిపడ్డారు. సమావేశంలో దొబ్బల సౌజన్య, మలీదు వెంకటేశ్వర్లు, మొక్కా శేఖర్‌గౌడ్, ఏలూరి రవి, హుస్సేన్, పుచ్చకాయల వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు


ఖమ్మంవైరారోడ్: సీపీఎం, బీఎస్పీ, సీపీఐ (ఎంఎల్) పార్టీల నుంచి పలువురు నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ పార్టీ కండువా కప్పి వారిని ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కిన్నెర రమేశ్, అయిల్‌పొంగు వెంకన్న, కత్తుల వీరభద్రంతోపాటు 18 కుటుంబాల వారు ఉన్నారు.

మేనిఫెస్టోలో చేర్చాలి..

ఉద్యమకారుల డిమాండ్లను బీఆర్ఎస్ మేనిఫెస్టోలో చేర్చాలని కోరుతూ ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌కు ఉద్యమకారులు వినతిపత్రం అందజేశారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొని జైళ్లకు వెళ్లి కేసులపాలైన తాము కేసీఆర్ బాటలో నడుస్తున్నామని, తమ డిమాండ్లను పార్టీ మేనిఫెస్టోలో చేర్చాలని కోరారు. కార్యక్రమంలో పగడాల నరేందర్, రడం సురేశ్, పందిగామ రాజ్‌కుమార్, కాసాని నాగేశ్వరరావు, లింగనబోయిన సతీశ్, కోడిరెక్క ఉమాశంకర్ పాల్గొన్నారు.

ప్రజలకు ఏంకావాలో సీఎంకు తెలుసు

ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎంపీ నామా


మాట్లాడుతున్న ఎంపీ నామా, పక్కన రాములునాయక్, మదన్‌లాల్

కొణిజర్ల: తెలంగాణ ప్రజలకేం కావాలో సీఎం కేసీఆర్‌కు తెలుసునని, ఈ నెల 16న సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టే మేనిఫెస్టోతో ప్రతిపక్షాల దిమ్మతిరగడం ఖాయమని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలంలోని మంగాపురంలో డీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో తనకు కొణిజర్ల మండలం నుంచి అత్యధిక మెజార్టీ వచ్చిందని, ఇప్పుడు వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్‌కు కూడా అంత కంటే రెట్టింపు మెజార్టీ రావాలన్నారు. కొందరు గ్యారంటీల పేరుతో మాయమాటలు చెప్పుకుంటూ వస్తున్నారని, ఇంతవరకు తమ అభ్యర్థి ఎవరో చెప్పుకోలేని వారు ఇక ప్రజలకేం మంచి చేస్తారని ప్రశ్నించారు. వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ మాట్లాడతూ అందరి జెండా, ఎజెండా కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేయడమేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్, రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కవిత, సర్పంచ్ అఫ్జల్‌బీతో పాటు వెంకటరమణ, చిరంజీవి, రవి, రామారావు, శ్రీను, బ్రహ్మం, మల్లేశ్, కిరణ్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, బాబు పాల్గొన్నారు.

సిరిపురంలో 'దళితబంధు' రగడ

- బీఆర్ఎస్‌ను వెలివేసిన రెండు దళిత కాలనీలు
- గ్రామంలో దండోరా, ఫ్లెక్సీ ఏర్పాటు


సిరిపురంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

వైరారూరల్: మండలంలోని కేజీ సిరిపురం గ్రామంలో రెండు దళితకాలనీలవాసులు బీఆర్ఎస్ నాయకులు తమ కాలనీల్లోకి రాకుండా వెలివేస్తున్నామని దండోరా వేసి ప్రకటించారు. అందుకు కారణాలు వివరిస్తూ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఆదివారం సిరిపురంలో ఆయా కాలనీలవాసులు మాట్లాడారు. రెండో విడత దళితబంధు పథకం తమ గ్రామంలోని మూడు దళిత కాలనీల మధ్య చిచ్చురేపిందని, దీంతో దళితుల మధ్యనే కలహాలు ఏర్పడ్డాయని, బీఆర్ఎస్ నాయకుల కుట్రలతోనే ఇది జరిగిందని తూర్పుకాలనీ, ఇందిరమ్మకాలనీవాసులు దండోరా వేసి మరీ ప్రకటించామని తెలిపారు. ఎమ్మెల్యే రాములునాయక్ వర్గానికి చెందిన నాయకులంతా కుట్రపూరితంగా వ్యవహరించి ఏళ్లుగా కలిసి ఉంటున్న తూర్పుకాలనీ, ఇందిరమ్మకాలనీ, రాజుపేట కాలనీలను మూడు భాగాలుగా విడదీశారని ధ్వజమెత్తారు. కేవలం రాజుపేటకాలనీకి చెందిన వారినే రెండో విడత దళితబంధు లబ్ధిదారులుగా ఎంపిక చేశారని, ఈ పరిణామం తీవ్రంగా బాధించిందని తెలిపారు. దీనికి ప్రతిగా బీఆర్ఎస్ నాయకులు ఎవరినీ తూర్పుకాలనీ, ఇందిరమ్మకాలనీలోకి అడుగు పెట్టేందుకు వీలులేకుండా వెలివేస్తున్నామని చెప్పారు. అయితే, ఈ ఫ్లెక్సీని బీఆర్ఎస్ నాయకులు దహనం చేశారు. దీంతో పోలీసులు గ్రామంలో ముందస్తు చర్యలు చేపట్టారు.

ఆరోగ్యకార్డు కోసం వసూలుపై నిరసన


మంగాపురంలో కార్డులు ఇస్తున్న దృశ్యం

నేలకొండపల్లి: మండలంలోని గ్రామాల్లో ఇటీవల ఓ ప్రైవేట్ బృందం ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ పథకం పేరిట ఆరోగ్యకార్డులు అందించేందుకు ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేస్తోంది. అందులో భాగంగా మంగాపురంతండాలో రెండురోజులుగా స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో క్యాంప్ ఏర్పాటు చేశారు. ఒక్కొక్కరి దగ్గర రూ.100 వసూలు చేసి కార్డు ఇస్తున్నారు. దీనిపై కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు ధరావత్ రాధాకృష్ణమూర్తి నిర్వాహకులను నిలదీశారు. వీరి చేతివాటంపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఇంత జరుగుతున్నా మండల అధికారులు పట్టించుకోకపోవటం దారుణమన్నారు. కాగా, ఈ విషయంపై నిర్వాహకులను వివరణ కోరేందుకు యత్నించగా స్పందించలేదు.

ఉమ్మడి జిల్లాస్థాయి చెస్ ఎంపికలు షురూ


చెస్ పోటీలు ప్రారంభిస్తున్న దృశ్యం

ఖమ్మంస్పోర్ట్స్: ఉమ్మడి జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని త్రివేణి పాఠశాలలో ఆదివారం జిల్లాస్థాయి చెస్ ఎంపికలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరి హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి జి.జ్యోత్స్న, అంతర్జాతీయ రేటింగ్ క్రీడాకారుడు గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అండర్-15 విభాగంలో నిర్వహించిన ఎంపికలకు అధిక సంఖ్యలో క్రీడాకారులు రావడంతో మరోరోజు పొడిగించినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతిభ చూపిన నలుగురు బాలబాలికల చొప్పున ఎంపిక చేస్తామని చెప్పారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు


తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

చర్ల: మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. మండల కేంద్రమైన చర్లలో ఆదివారం జరిగిన వారపు సంతకు సరిహద్దు ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని బీజాపూర్, దంతెవాడ, సుకుమా జిల్లాల్లోని వివిధ ఆదివాసీ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ఆదివాసీలు తరలివస్తుండగా వారి మాటున మావోయిస్టులు, మిలిటెంట్లు, మిలీషియా సభ్యులు, కొరియర్లు రావచ్చునన్న అనుమానంతో చర్ల సీఐ బి.రాజగోపాల్ నేతృత్వంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో భాగంగా చర్లకు వచ్చే ప్రధాన రహదారులైన లెనిన్‌కాలనీ, లక్ష్మీకాలనీ, విజయకాలనీ పెట్రోల్‌బంక్, తాలిపేరు ప్రాజెక్ట్, కలివేరు క్రాస్‌రోడ్, ఆర్ కొత్తగూడెం సెంటర్లలో మోహరించిన సివిల్, స్పెషల్ పార్టీ, సీఆర్‌పీఎఫ్ పోలీసులు వచ్చివెళ్లే ఆదివాసీలను ఆపి నిశితంగా తనిఖీ చేసి నిర్ధారించుకున్న తరువాత విడిచిపెట్టారు.

వెలుగుమట్ల గురుకులంలో కలకలం

- గుర్తుతెలియని యువకుల చొరబాటు
- సొమ్మసిల్లి పడిపోయిన బాలికలు.. ఆస్పత్రికి తరలింపు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలికలు

ఖమ్మంఅర్బన్: నగరంలోని వెలుగుమట్ల గుట్టపై ఉన్న కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని యువకులు చొరబడ్డారు. దీంతో భయపడిన బాలికలు సొమ్మసిల్లి పడిపోవడంతో వారిని ఆస్పత్రికి తరలించారు. స్థానికుల కథనం ప్రకారం.. పాఠశాలలోకి ఆదివారం రాత్రి గుర్తు తెలియని ముగ్గురు యువకులు చొరబడి ఎదురుపడిన బాలికలను కత్తులతో బెదిరించినట్లు సమాచారం. దీంతో భయపడిన బాలికలు సొమ్మసిల్లి పడిపోయినట్లు తెలిసింది. గమనించిన పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కొందరు బాలికలు మాత్రం గుర్తు తెలియని యువకులు వచ్చారని, ముఖానికి ముసుగులతో ఉన్నారని, కత్తి చూపించి బెదిరించారని చెబుతున్నారు. మొత్తం 10 మంది విద్యార్థినులు సొమ్మసిల్లి పడిపోగా వారిలో ఐదుగురిని ఆస్పత్రికి తరలించారు. ఎంఈఓ ఎం.శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. పాఠశాల ఎస్‌ఓను ఘటనపై ఆరా తీసేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదని, పూర్తి వివరాలు తెలుసుకుంటున్నానని బదులిచ్చారు. ఘటనపై ఖమ్మం అర్బన్ సీఐ శ్రీహరి సైతం విచారణ చేపట్టారు. ముసుగులతో వచ్చిన వారు ఎవరు? రాత్రి విధుల్లో ఉన్న సిబ్బంది ఎవరు? అనే వివరాలు తెలియాల్సి ఉంది.

ఆర్టీసీ బస్సులో తరలిస్తున్న గంజాయి పట్టివేత


గంజాయి తరలిస్తున్న వ్యక్తితో ఎక్సైజ్ అధికారులు

పాల్వంచ: ఆర్టీసీ బస్సులో తరలిస్తున్న గంజాయిని ఎక్సైజ్ అధికారులు చాకచక్యంగా పట్టుకున్నారు. పాల్వంచ ఎక్సైజ్ సీఐ గురునాథ్ రాథోడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒరిస్సా రాష్ట్రం మల్కన్‌గిరి నుంచి హైదరాబాద్‌కు ఆర్టీసీ బస్సులో గంజాయి తరలిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు జిల్లా డిప్యూటీ కమిషనర్ జి.జనార్ధన్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ గణేశ్ ఆదేశాల మేరకు పాల్వంచ ఆర్టీసీ బస్టాండ్ వద్ద బస్సును సోదా చేశారు. ఈ దాడిలో ఒడిస్సా రాష్ట్రం మల్కనగిరి బాపనపల్లికి చెందిన మల్లపడి యామి అనే వ్యక్తి అదుపులోకి తీసుకుని స్వాధీనం చేయగా.. అతడి వద్ద రూ.2.50 లక్షలు విలువ చేసే రూ.10 కేజీల గంజాయి లభించింది. అదేవిధంగా బూర్గంపాడు నుంచి పాల్వంచకు 20 లీటర్ల నాటు సారాను తరలిస్తున్న కొత్తగూడెం కారుకొండ రామవరంకు చెందిన భూక్యా శ్రీను వద్ద స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అక్రమంగా గంజాయి స్మగ్లింగ్ చేస్తున్నట్లు తెలిస్తే 87126 58852కు సమాచారం అందించాలని కోరారు.

బండారు వ్యాఖ్యలపై సుప్రీంకోర్టుకు వెళ్తా

- అతడిలాంటి చీడపురుగుల్ని ఏరివేయాలి: మంత్రి రోజా



మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): టీడీపీ నాయకుడు బండారు సత్యనారాయణమూర్తి తనపై చేసిన వ్యాఖ్యలపై సుప్రీంకోర్టుకు వెళ్లి న్యాయపరంగా పోరాడతానని ఏపీ మంత్రి ఆర్.కె.రోజా చెప్పారు. బండారు లాంటి చీడపురుగులను ఏరిపారేయాలంటూ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలను ఒకమాట అనాలంటే భయపడే పరిస్థితి రావాలన్నారు. చైనాలో జరుగుతున్న 19వ ఆసియా క్రీడల్లో టెన్నిస్ మెన్స్ డబుల్స్‌లో సిల్వర్ మెడల్ సాధించిన మైనేని సాకేత్‌ను ఆంధ్రప్రదేశ్ లాన్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో ఆదివారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మీడియాతో మాట్లాడారు. స్కిల్ కుంభకోణంలో అవినీతికి పాల్పడిన చంద్రబాబునాయుడును సీఐడీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపడంతో టీడీపీ వారికి పిచ్చెక్కి ఎవరిని తిడదామా.. అని ఆలోచిస్తున్నారని దుయ్యబట్టారు. ఢిల్లీ నుంచి లాయర్లు వచ్చినా చంద్రబాబును జైలు నుంచి బయటకు తీసుకురాలేకపోతున్నారని పేర్కొన్నారు. బండారు సత్యనారాయణమూర్తి తన నియోజకవర్గంలోని, ఇంట్లోని మహిళలకు ఏవిధమైన విలువ ఇస్తారో బహిర్గతమైందని చెప్పారు. తనకు ఊహ తెలిసినంతవరకు ఎవరూ ఇంతలా ఒక మహిళ గురించి మాట్లాడలేదన్నారు. మహిళలను కించపరిచేలా మాట్లాడేవారు చరిత్రహీనులుగా మిగిలిపోతారని చెప్పారు. టీడీపీ, జనసేన నాయకులు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు.

మరిన్ని ఏపీ వార్తలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

లక్ష్యం.. క్లీన్ స్వీప్

- పార్టీ శ్రేణులను ఎన్నికలకు సమాయత్తం చేయనున్న ఏపీ సీఎం వైఎస్ జగన్
- నేడు విజయవాడలో వైఎస్సార్‌సీపీ ప్రతినిధుల సమావేశం




విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో సిద్ధమైన వేదిక

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 175కు 175 స్థానాల్లో విజయమే లక్ష్యంగా ఎన్నికలకు శ్రేణులను సమాయత్తం చేసేందుకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సన్నద్ధమయ్యారు. అందులో భాగంగా సోమవారం విజయవాడలో ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో పార్టీ ప్రతినిధుల సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు, ప్రాంతీయ సమన్వయకర్తలు, జిల్లా పార్టీ అధ్యక్షుల నుంచి జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, మండల పార్టీ అధ్యక్షుల వరకు 8 వేల మందికిపైగా ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొంటారు. గత 53 నెలలుగా సుపరిపాలన, సంక్షేమాభివృద్ధి పథకాల ద్వారా ప్రతి ఇంటికీ, గ్రామానికీ, నియోజకవర్గానికీ, జిల్లాకు, రాష్ట్రానికీ చేసిన మంచిని మరింత ప్రభావవంతంగా వివరించడం.. ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని ఎక్కడికక్కడ తిప్పికొట్టడంపై ప్రతినిధులకు సీఎం వైఎస్ జగన్ దిశా నిర్దేశం చేయనున్నారు. అధికారంలోకి వచ్చాక విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలు – పరిపాలన వికేంద్రీకరణ ద్వారా రాష్ట్రం సమగ్రాభివృద్ధి దిశగా పరుగులెత్తిస్తున్న తీరును కళ్లకు కట్టినట్లుగా వివరించి.. ప్రగతిపథంలో రాష్ట్రం దూసుకెళ్లాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పాలని సూచించనున్నారు. ఇందుకు 'రాష్ట్రానికి జగనే కావాలి'(వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమాన్ని చేపట్టాల్సిన తీరుపై ప్రతినిధులకు మార్గ నిర్దేశం చేయనున్నారు. ఈ సమావేశానికి హాజరైన ప్రతినిధులు సీఎం సందేశాన్ని గ్రామ స్థాయికి తీసుకెళ్తారు.

నేడు అందరి దృష్టీ కోర్టుల వైపే

- నేడు సుప్రీంకోర్టులో చంద్రబాబు క్వాష్ పిటిషన్ విచారణ
- కస్టడీ, బెయిల్ పిటిషన్లపై ఏసీబీ కోర్టు తీర్పు
- ఇన్నర్ రింగ్ రోడ్డు, అంగళ్లు, ఫైబర్ నెట్ కేసుల్లోనూ హైకోర్టు తీర్పు
- ఇప్పటికే సమర్థవంతంగా వాదనలు వినిపించిన సీఐడీ



సాక్షి, న్యూఢిల్లీ /సాక్షి అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో అరెస్టయి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో సోమవారం విచారణ జరుగనుంది. జస్టిస్ అనిరుద్దాబోస్, జస్టిస్ బేలా ఎం.త్రివేదిలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించనుంది. ఆరవ నంబర్ కోర్టులో ఐటమ్ 59గా ఈ పిటిషన్‌ను జాబితాలో చేర్చారు. గత విచారణ సందర్భంగా హైకోర్టుకు సమర్పించిన డాక్యుమెంట్లను అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సూచించిన విషయం విదితమే. ఇదిలా ఉండగా, ఇదే కేసులో చంద్రబాబు కస్టడీ, బెయిల్ పిటిషన్లపై విజయవాడ ఏసీబీ న్యాయస్థానం సోమవారం తీర్పు వెలువరించనుంది. ఈ కేసులో ఇప్పటికే చంద్రబాబుకు రెండ్రోజుల కస్టడీకి న్యాయస్థానం అనుమతించింది. కానీ చంద్రబాబు ఉద్దేశ పూర్వకంగా కాలయాపన చేయడంతో పాటు కస్టడీలో విచారణకు ఏమాత్రం సహకరించలేదని సీఐడీ న్యాయస్థానానికి తెలిపింది. దాంతో పాటు ఈ కేసు దర్యాప్తులో తాజాగా కనుగొన్న కీలక ఆధారాలపై ఆయన్ను సమగ్రంగా విచారించాల్సిన అవసరం ఉందని న్యాయస్థానానికి నివేదించింది. ప్రధానంగా షెల్ కంపెనీల ద్వారా టీడీపీ ఖాతాలో చేరిన అక్రమ నిధుల వ్యవహారంపై ప్రశ్నించాల్సి ఉందని కోర్టు దృష్టికి తీసుకొచ్చింది. అందుకే చంద్రబాబును మరో మూడు రోజుల పాటు కస్టడీకి అనుమతించాలని కోరింది. మరో వైపు చంద్రబాబు తరఫు న్యాయవాదులు ఆయన్ను కస్టడీకి ఇవ్వొద్దని, బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ న్యాయస్థానాన్ని కోరారు. దీనిపై సీఐడీ తరఫు న్యాయవాదులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రాజకీయంగా బలవంతుడైన చంద్రబాబు ఇప్పటికే ఈ కేసులో సాక్షులను బెదిరిస్తున్నారని ఉదాహరణలతో సహా కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో ఆయనకు బెయిల్ ఇస్తే సాక్షులను మరింతగా బెదిరించడంతో పాటు కేసు దర్యాప్తును ప్రభావం చేస్తారని వాదనలు వినిపించారు. కాబట్టి చంద్రబాబు బెయిల్ పిటీషన్ తిరస్కరించాలని న్యాయస్థానాన్ని కోరారు. ఈ పిటీషన్లపై వరుసగా మూడు రోజుల పాటు వాదనలు విన్న న్యాయస్థానం రిజర్వు చేసిన తీర్పును నేడు వెలువరించనుంది. ఈ నేపథ్యంలో విజయవాడ ఏసీబీ న్యాయస్థానం తీర్పుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

హైకోర్టులో బెయిల్ పిటిషన్లపై నేడు తీర్పులు

మరో వైపు హైకోర్టులో చంద్రబాబు దాఖలు చేసిన మూడు బెయిల్ పిటిషన్లపై సోమవారం తీర్పులు వెలువడనున్నాయి. అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు, అంగళ్లు, ఫైబర్ నెట్ కేసుల్లో బెయిల్ కోసం చంద్రబాబు వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై ఇటీవల వాదనలు ముగియడంతో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కే.సురేష్‌రెడ్డి తీర్పులను రిజర్వు చేసిన సంగతి తెలిసిందే. ఈ మూడు పిటిషన్లపై న్యాయమూర్తి సోమవారం తీర్పులను వెలువరించనున్నారు.

మహిళల వ్యక్తిత్వ హననం దారుణం


మంత్రి రోజాకు సినీనటి మీనా మద్దతు



సాక్షి, అమరావతి: మహిళలు రాజకీయాల్లో ఎదుగుతుంటే వ్యక్తిత్వ హననం ద్వారా అడ్డుకోవాలని చూడటం సిగ్గుచేటని సినీ నటి మీనా అన్నారు. నీచమైన వ్యాఖ్యలు చేసినంత మాత్రాన మహిళలు భయపడి, తలుపులు మూసుకుని ఏడుస్తారనుకోవడం అవివేకమన్నారు. ఇటీవల మంత్రి రోజాపై టీడీపీ నాయకుడు, మాజీ మంత్రి బండారు సత్యనారాయణ అనుచిత వ్యాఖ్యలను మీనా ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఓ వీడియోలో ఖండించారు. 'కాలం మారిపోయింది. సమాజంలో మహిళలు బలమైన శక్తిగా ఎదిగారు. అభద్రతభావం, ఈర్ష్యతోనే మంత్రి రోజాను నీచంగా మాట్లాడి మహిళలపై మీకున్న కుసంస్కారాన్ని ప్రదర్శించారు' అంటూ బండారుపై మండిపడ్డారు. సినీ పరిశ్రమలోకి వచ్చినప్పటి నుంచి రోజా ఎంతో కష్టపడి ఉన్నత స్థాయికి ఎదిగారని, రాజకీయాల్లోనూ తనను తాను నిరూపించుకుంటూ డైనమిక్ లీడర్‌గా గుర్తింపు పొందారని తెలిపారు. అలాంటి వ్యక్తిపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన బండారు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని మహిళల గౌరవాన్ని కాపాడాలని మీనా విన్నవించారు.

రూ.2,300 కోట్లతో.. విశాఖలో భారీ ఐటీ బిజినెస్ పార్క్

- మధురవాడ హిల్ నెంబర్–3లో 19 ఎకరాల్లో అభివృద్ధి
- ఐటీ, ఐటీ ఆధారిత, ఆర్థిక సేవా కార్యకలాపాలకు అనుగుణంగా నిర్మాణాలు
- వీటితో పాటు సమావేశ మందిరాలు, బిజినెస్ హోటల్, సర్వీస్ అపార్ట్‌మెంట్లు, ఓపెన్ ఎయిర్ థియేటర్, ఫుడ్ అండ్ బేవరేజెస్ సౌకర్యాలు కూడా..
- ప్రాజెక్టు వ్యయంలో 40 శాతం ఈక్విటీతో ప్రత్యేక కంపెనీ ఏర్పాటు
- ఈక్విటీగా ఏపీఐఐసీ రూ.239 కోట్లు, భాగస్వామ్య కంపెనీ రూ.681 కోట్లు
- మిగిలిన రూ.1,380 కోట్లు రుణ రూపంలో సమీకరణ
- డీపీఆర్ తయారీ నుంచి నిర్వహణ వరకు భాగస్వామ్య కంపెనీదే బాధ్యత
- ఆసక్తిగల సంస్థల నుంచి బిడ్లు ఆహ్వానించిన ఏపీఐఐసీ



సాక్షి, అమరావతి: ఐటీ, ఐటీ ఆధారిత పరిశ్రమల ఆకర్షణలో విశాఖ నగరం ముందంజలో ఉందని ఇటీవల నీతి ఆయోగ్ ప్రకటించిన నేపథ్యంలో.. ఏపీఐఐసీ (ఏపీ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్) కూడా భారీ ఐటీ బిజినెస్ పార్క్‌ను ఇక్కడ ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. విశాఖలో ఇప్పటికే అదానీ డేటా సెంటర్‌తో పాటు ఐటీ పార్క్, రహేజా గ్రూపు ఇన్‌ఆర్బిట్ మాల్‌తో పాటు ఐటీ పార్క్ ఏర్పాటుచేస్తున్న సంగతి తెలిసిందే. మధురవాడ హిల్ నెంబర్–3 మీద 18.93 ఎకరాల విస్తీర్ణంలో ఐ–స్పేస్ పేరుతో ఈ ఐటీ బిజినెస్ పార్కును పీపీపీ విధానంలో అభివృద్ధి చేయడానికి ఆసక్తిగల సంస్థల నుంచి ఏపీఐఐసీ తాజాగా బిడ్లను ఆహ్వానించింది. ఐటీ, ఐటీ ఆధారిత కార్యకలాపాలు నిర్వహించుకునే సంస్థలకు అనుగుణంగా వాణిజ్య సముదాయాలతో పాటు సమావేశ మందిరాలు, బిజినెస్ హోటల్స్, సర్వీస్ అపార్ట్‌మెంట్స్, ఓపెన్ ఎయిర్ థియేటర్, ఫుడ్ అండ్ బేవరేజెస్ ఫెసిలిటీలతో పాటు తగినంత పార్కింగ్ సదుపాయాలు ఉండే విధంగా ఈ క్యాంపస్‌ను సుమారు రూ.2,300 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేయనున్నారు. ఇందుకోసం భాగస్వామ్య కంపెనీతో ప్రత్యేక సంస్థ (ఎస్‌పీవీ)ని ఏర్పాటుచేస్తారు. ఈ ఎస్‌పీవీలో ఏపీఐఐసీ 26 శాతం వాటాను, భాగస్వామ్య కంపెనీ 74 శాతం వాటాను కలిగి ఉంటుంది.

బహుళజాతి సంస్థలను ఆకర్షించేలా..

ఇక మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.2,300 కోట్లలో 40 శాతం ఈక్విటీగా సమకూర్చాల్సి ఉంటుంది. ఈక్విటీ రూపంలో ఏపీఐఐసీ రూ.239 కోట్లు, భాగస్వామ్య కంపెనీ రూ.681 కోట్లు సమకూరుస్తాయి. మిగిలిన మొత్తం రూ.1,380 కోట్లను రుణ రూపంలో సేకరిస్తారు. ఈ ప్రాజెక్టు డిజైన్ దగ్గర నుంచి నిర్మాణం, బ్రాండింగ్, నిర్వహణ అన్నీ భాగస్వామ్య కంపెనీయే చూడాల్సి ఉంటుంది. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు.. బహుళజాతి సంస్థలను ఆకర్షించేలా ఈ బిజినెస్ పార్క్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు ఏపీఐఐసీ వీసీ ఎండీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పబ్లిక్, ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంలో అభివృద్ధి చేస్తున్న ఈ ప్రాజెక్టులో భాగస్వామిగా చేరడానికి ఆసక్తిగల సంస్థల నుంచి బిడ్లను ఆహ్వానించామని, భాగస్వామ్య కంపెనీ ఎన్నిక అనంతరం నిర్మాణ పనులను ప్రారంభించి వేగంగా అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు. మరోవైపు.. గడిచిన ఐదేళ్లలో విశాఖ రియల్ ఎస్టేట్ రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని, పలు అంతర్జాతీయ సంస్థలు, రిటైల్ సంస్థలు విశాఖలో ఏర్పాటుకావడంతో స్థిరాస్తి ధరలు 20 శాతం పైగా పెరిగినట్లు ఏపీఐఐసీ అధికారులు వెల్లడించారు. వాణిజ్య సముదాయాలకు భారీగా డిమాండ్ ఉండటంతో ఐ–స్పేస్ బిజినెస్ పార్క్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.


'ఈశాన్యం'లో చల్లని కబురు

20 నాటికి ఈశాన్య రుతుపవనాల రాక!

సాక్షి, విశాఖపట్నం: నైరుతి రుతుపవనాలు ఈ ఏడాది ఒకింత నిరాశపరిచిన నేపథ్యంలో ఈశాన్య రుతుపవనాలు ఎలాంటి ప్రభావం చూపుతాయన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది. ఆ ఆందోళనకు తెరదించుతూ భారత వాతావరణ శాఖ(ఐఎండీ) చల్లని కబురు మోసుకొచ్చింది. ఈ ఏడాది ఈశాన్య రుతుపవనాల వల్ల రాష్ట్రంలో సాధారణం కంటే ఒకింత అధిక వర్షపాతం నమోదవుతుందని తాజాగా ప్రకటించింది. దీనిని బట్టి అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు కొనసాగనున్న ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో కురిసే వర్షాలతో రబీ పంటలకు ఎంతో మేలు జరగనుంది. ఐఎండీ అంచనాల ప్రకారం రాష్ట్రంలోని దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో ఈశాన్య రుతుపవనాలు సాధారణానికి మించి, ఉత్తర కోస్తాంధ్రలో సాధారణంగాను వర్షాలు కురవనున్నాయి. ఈ రుతుపవనాలు రాష్ట్రంలోకి ఈ నెల 20 నాటికల్లా ప్రవేశించే అవకాశాలు ఉన్నాయని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు.

జిల్లా వార్తలు


జమలాపురం ఆలయంలో 15 నుంచి ఉత్సవాలు..



శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయం

ఎర్రుపాలెం: తెలంగాణా తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఈనెల 15 నుంచి 23వ వరకు శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ. కె. జగన్మోహన్ రావు, చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. ఈనెల 15 శ్రీవారికి చందన అలంకారం–ప్రత్యేక పూజలు, శ్రీవేంకటేశ్వర స్వామి, శ్రీఅలివేలు మంగ, శ్రీపద్మావతి అమ్మవార్లకు పంచామృతాలతో అభిషేకం, కలశ స్థాపన, శ్రీస్వామివారిని, అమ్మవార్లను యాగశాల ప్రవేశంతో ఉత్సవాలను ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. 16న శ్రీగాయత్రీ దేవిగా, 17న శ్రీఅన్నపూర్ణాదేవి, 18న శ్రీమహాలక్ష్మీదేవి, 19న శ్రీమహాచండీదేవి, సామూహిక అర్చనలు, 20న శ్రీసరస్వతీదేవి అలంకరణ, 21న శ్రీలలితా త్రిపుర సుందరీదేవి అలంకరణ, 22న శ్రీదుర్గాదేవి అలంకరణ, చండీ హోమం, 23న శ్రీమహిషాసురమర్దనీ దేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిస్తారని వివరించారు. విజయదశమి రోజున చండీ హోమం, మహాపూర్ణాహుతి, శమీపూజ నిర్వహించనున్నారు. భక్తులు ఈఉత్సవాల్లో పాల్గొని శ్రీస్వామివారి, అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని ఈఓ కోరారు.

నవోదయలో ప్రవేశాలకు దరఖాస్తులు



కూసుమంచి: పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో 2024–25 విద్యా సంవత్సరానికి 9, 11వ తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు నవోదయ వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 31 నాటికి దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 8, 10వ తరగతి చదువుతున్న వారు అర్హులని, దరఖాస్తు చేసుకున్న వారికి వచ్చే ఏడాది ఫిబ్రవరి 10న రాతపరీక్ష నిర్వహిస్తామని తెలిపారు.

నవరాత్రి వేడుకలకు వేళాయె..

- రామాలయంలో ఇక అమ్మవారి 'సంబురాలు'
- 15 నుంచి 23 వరకు శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు
- తీరొక్క అలంకరణలో దర్శనమివ్వనున్న లక్ష్మీతాయారమ్మ వారు
- 24న శమీ, ఆయుధ పూజ, లీలా మహోత్సవం



శమీ, ఆయుధ పూజ చేస్తున్న అర్చకులు (ఫైల్)

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో ఈనెల 15 నుంచి 'శ్రీదేవి శరన్నవ రాత్రి ఉత్సవాలు' జరగనున్నాయి. చెడుపై మంచి సాధించిన విజయానికి సూచికగా, రాక్షసుడైన మహిషాసురుడిని అంతమొందించి భక్తులను కాపాడి రక్షణగా నిలిచిన అమ్మవారి ధైర్యానికి ప్రతీకగా నవరాత్రి ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ. శ్రీరామచంద్రుడు కొలువై ఉన్న భద్రగిరి క్షేత్రంలో మహాలక్ష్మి అమ్మవారిని ఈనెల 15 నుంచి 23 వరకు రోజుకో రూపంలో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారు. అలాగే, భద్రాద్రి రాముడి సన్నిధిలో తొమ్మిది రోజుల పాటు వాల్మీకి రామాయణాన్ని పారాయణం చేస్తారు.

15 నుంచి అలంకరణలు..

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ప్రతి ఏడాది తొమ్మిది రోజుల పాటు లక్ష్మీదేవిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు చేయడం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ప్రత్యేకత. తొమ్మిది రోజుల పాటు అంగరంగ వైభవోపేతంగా వేడుకలు జరిపి దశమి రోజున భక్తరామదాసు నిర్మించిన దసరా మండపంలో లీలా మహోత్సవం నిర్వహిస్తారు. కాగా ఆలయ ప్రాంగణంలోని చిత్రకూట మండపంలో శ్రీరామాయణాన్ని పారాయణం చేస్తారు. ఇందులో ఈ ఏడాది భక్తులను, స్వామివారి ఆరాధకులను భాగస్వామ్యం చేయనున్నారు. ఈనెల 15 నుంచి 23వరకు శ్రీలక్ష్మీ తాయారమ్మవారి సన్నిధిలో అభిషేకం, చిత్రకూట మండపంలో సామూహిక శ్రీ రామాయణ పారాయణం, మధ్యాహ్నం శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి సన్నిధిలో సామూహిక కుంకుమార్చన, సాయంత్రం 7 గంటలకు చిత్రకూట మండపంలో శ్రీరామాయణ ప్రవచనం, రాత్రికి స్వామివారికి తిరువీధి సేవలు నిర్వహించాలని ఆలయ వైదిక కమిటీ నిర్ణయించింది.

అలంకారాల ప్రత్యేకతలు

ఆదిలక్ష్మి



భగవంతుని గుర్తించడానికే ఆలంబమైన లక్ష్మీ తత్వాన్నే ఆదిలక్ష్మి అంటారని, ఆ అమ్మవారి వల్లనే వేదవేద్యుడిని గుర్తించగలిగారని ప్రతీతి. చతుఃభుజాలతో పైరెండు చేతుల్లో పద్మాలను ధరించి వరద–అభయ హస్తాలతో విరాజిల్లుతున్న ఆదిలక్ష్మి అమ్మవారు తొలి అలంకరణగా రామాలయంలో దర్శనమిస్తారు.

సంతాన లక్ష్మి



'అఖిల జగన్మాతరం, అస్మన్మాతరం' అంటూ ప్రార్థించారు రామానుజా చార్యులు. సకల చరాచర జగత్తు ఆ అమ్మ సంతామని, అందుకే ఆమె సంతానలక్ష్మి అని, ఈ రూపంలో ఉన్న అమ్మను ఆరాధిస్తే సంతాన అవరోధాలన్ని తొలగి సత్సంతానం, సుఖశాంతులు కలుగుతాయని చెబుతారు.

గజ లక్ష్మి



లక్ష్మీః దివ్యైః గజేంద్రైః మణిగణఖచితైః అని కీర్తి స్తారు పూర్వాచార్యులు. ఈ అమ్మను ఆరాధిస్తే అధికారము, మహా సంపద కలుగుతాయని శాస్త్రం చెబుతోంది. చెదరని అధికారం, తరగని సంపద కలుగుతాయని పండితులు అంటున్నారు.

ధనలక్ష్మి



'హిరణ్యవర్ణాం హరిణీం సువర్ణ రజతస్రజాం..' అంటూ శ్రీ సూక్తం అమ్మవారిని ధనలక్ష్మిగా కీర్తిస్తుంది. ధనం అంటే కేవలం డబ్బు మాత్రమే కాదు. విద్య, బలం, కీర్తి మొదలైనదంతా ధనమేనని, విద్యాధనం, హిరణ్య ధనం, శక్తి ధనం ప్రసాదిస్తుంది కాబట్టే ఈ అమ్మకు ధనలక్ష్మి అని, ముగ్గరమ్మల శక్తిని భక్తులకు పంచుతుందని ప్రతీతి.

ధాన్యలక్ష్మి



'ధనధాన్యకరీం...సిద్ధీం' అంటూ కీర్తిస్తుంది పురాణం. అన్నిరకాల ధాన్యాన్ని ప్రసాదించేది ఈ అమ్మేనని, ఈ అమ్మను ఆరాధిస్తే ఈతి బాధలన్నీ తొలగి, సమయానికి తగు వర్షాలు కురిసి దేశం సస్యశ్యామలంగా, సుభిక్షంగా ఉంటుందని, వ్యవసాయ ప్రధానమైన భారతదేశ సౌభాగ్యం కోసం ధాన్యలక్ష్మిని పూజిస్తారని చెబుతారు.

విజయలక్ష్మి..



'జ్ఞానేశ్వరి..విజయ ప్రధా' అని కీర్తిస్తారు పరాశరభట్టర్. విజయం అంటే కేవలం యుద్ధ విజయమే కాదని, అన్ని రంగాల్లో విజయమని, ఈ రూపంలో ఉన్న అమ్మను సేవిస్తే అన్ని రంగాల్లో మంచి జరుగుతుందని నమ్మకం.

ఐశ్వర్యలక్ష్మి



'అస్యేశానా జగతో విష్ణుపత్నీ' అని కీర్తిస్తుంది యజుర్వేదం. ఐశ్వర్యం అంటే శాఖాపరమైన శక్తి సామర్థ్యాలని, అఖిలాండ కోటి బ్రహ్మాండాలకు శాసకరాలు, కరుణారూపిణి అయిన ఈ అమ్మ యొక్క క్రీగంటి చూపుల కదలికలనేనని చెబుతారు. ఈ రూపంలో ఉన్న అమ్మను ఆరాధిస్తే శాసకత్వము, వాక్కు ప్రభావం, అనంత ఐశ్వర్యం కలుగుతాయని ప్రతీతి.

వీరలక్ష్మి..



దారిద్ర్య ధ్వంసినీందేవీం సర్వోపద్రవవారిణీం.. అని అమ్మవారిని వీరలక్ష్మిగా కీర్తిస్తుంది పురాణం. దారిద్ర్యాన్ని, అన్ని రకాల ఉపద్రవాలను పారదోలే వీరత్వం ఈ అమ్మ సొంతమని, త్రిమూర్తులకు సైతం సాధ్యం కాని మహిషాసురిడిని, ముగ్గరమ్మల శక్తి స్వరూపంగా ఆవిర్భవించి సంహరించిందని శాస్త్రాలు చెబుతున్నాయి.

మహాలక్ష్మి..



ధనం, ధాన్యం, సంతానం, విద్య, అధికారం, విజయం, ఐశ్వర్యం... ఇలా మనిషికి అవసరమైన అష్టైశ్వర్యాలను ప్రసాదించడానికి అష్టలక్ష్మి రూపాలను ధరించిన ఆదిలక్ష్మి, కరుణాస్వరూపమైన తన నిజరూపంలో భక్తులందరినీ అనుగ్రహిస్తుందని పండితులంటున్నారు.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి

ఒకరోజు ఆదాయం రూ.15,805



బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్ : పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. డ్యామ్‌పై నుంచి జలాశయాన్ని, డీర్‌పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 374 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.10,645 ఆదాయం లభించగా, 100మంది బోటు షికారు చేయడం ద్వారా టూరిజం కార్పొరేషన్‌కు రూ.5,160 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

11న అండర్ -19 క్రీడా జట్ల ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్ : జూనియర్ కళాశాలల క్రీడల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీన నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో అండర్ – 19 క్రీడా జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడల సంఘం కార్యదర్శి మూసా ఒక ప్రకటనలో తెలిపారు. బాలికల ఫుట్‌బాల్, బాల బాలికల వాలీబాల్, కబడ్డీ జట్ల ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి గల ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రంతో పాటు, ఆధార్ కార్డు తీసుకొని ఉదయం 10 గంటలకు రిపోర్ట్ చేయాలని సూచించారు ఇందులో జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులను త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని ఆయన వివరించారు.

స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

భద్రాచలం: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలోని గిరిజన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోర్సుల శిక్షణ ఇవ్వనున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ తెలిపారు. వివిధ శిక్షణా సంస్థల ద్వారా వెబ్ మొబైల్ అప్లికేషన్, బ్యూటీషియన్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, సోలార్ టెక్నీషియన్, సీసీ టీవీ టెక్నీషియన్, పుట్టగొడుగుల సాగు, డెయిరీ ఫార్మింగ్, వర్మీ కంపోస్ట్ తయారీ, టూవీలర్ మెకానిక్ అంశాల్లో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. పదిహేను రోజుల నుంచి రెండునెలల పాటు సాగు శిక్షణలో ఉచిత భోజనం, వసతి కల్పిస్తామని తెలిపారు. వెబ్ మొబైల్ అప్లికేషన్, బ్యూటీషియన్ కోర్సుల్లో మహిళలకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. కోర్సుల వారీగా అర్హత నిర్ధారించగా, ఆసక్తి కలిగిన గిరిజన యువత విద్యార్హత పత్రాలు, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ జిరాక్స్ సర్టిఫికెట్లతో ఈ నెల 10వ తేదీన ఉదయం 9 గంటలకు ఐటీడీఏ ప్రాంగణంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని పీఓ సూచించారు.

రండీ.. సెల్ఫీ దిగండి!

ఇటీవల ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్–3 విజయవంతమైన విషయం విదితమే. ఈ మేరకు కేంద్ర సమాచార, సాంకేతిక, పౌరసంబంధాల విభాగం ఆధ్వర్యాన ఖమ్మం హెడ్డాఫీస్‌లో చంద్రయాన్ ప్రయోగంతో పాటు ప్రధాని మోదీ ఫొటోతో కూడిన సెల్ఫీ బోర్డు ఏర్పాటు చేశారు. జిల్లా వాసులు సెల్ఫీ దిగేందుకు ఈ బోర్డు ఏర్పాటు చేసినట్లు పోస్ట్‌మాస్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

– ఖమ్మంగాంధీచౌక్



ఖమ్మం హెడ్డాఫీస్‌లో ఏర్పాటు చేసిన సెల్ఫీబోర్డు